# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-04-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. సురక్షిత, సమృద్ధ, సుస్థిర భారతం కోసం సంకల్ప పత్రం పేరిట బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేసింది.**

**2. ఏప్రిల్ 1 నాటికి 18ఏళ్ళు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకునే గడువు నేటితో ముగుస్తోంది.**

**3. ఇంటర్ ప్రవేశాల ప్రక్రియ మే 15 నుంచి ప్రారంభమవుతుందని ఇంటర్మీడియట్ విద్యామండలి అధికారులు తెలిపారు.**

**4. ఎన్నికల విధుల్లో దేవదాయ సిబ్బందిని వినియోగించవద్దని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని బీజేపీ కోరింది.**

**5. నేడు దేశవ్యాప్తంగా అంబేడ్కర్ జయంతిని ఘనంగా జరుపుకుంటున్నారు.**

**6. ఐపీఎల్‌లో ఇవాళ కోల్‌కతా నైట్ రైడర్స్, లక్నో సూపర్ జైంట్స్‌తోనూ… ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్‌తోనూ తలపడతాయి.**

**==========================**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ జయంతిని నేడు దేశవ్యాప్తంగా వైభవంగా జరుపుకుంటున్నారు. పార్లమెంటు భవనం దగ్గర రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరులు అంబేడ్కర్‌కు పుష్పాంజలి ఘటించారు. దేశంలో అణగారిన వర్గాలకు కొత్తజీవితాన్ని ఇచ్చిన మహానుభావుడు, సామాజిక అసమానతలను నిర్మూలించడానికి కృషి చేసిన మేధావి అంబేడ్కర్ అంటూ ఆయనకు నివాళులర్పించారు.

--------------------------

గిరిజనులు, ఎస్సీల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషెన్ రాజు అన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 133 వ జయంతి సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని గునిపూడి, ప్రకాశం చౌక్‌లలో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిరుపతిలో రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి ఆర్కే

రోజా, ఒంగోలులో ప్రకాశం జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్, తిరుపతిలో జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, మచిలీపట్నంలో కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, చిత్తూరులో జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్, పార్వతీపురంలో పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోభిక అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

---------------------------

భారతీయ జనతా పార్టీ " సంకల్ప పత్ర" పేరుతో మెనిఫెస్టోను విడుదల చేసింది. ప్రధానమంత్రి, బిజేపీ సీనియర్ నాయకులు నరేంద్రమోదీ ఢిల్లీలోని బిజేపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, నిర్మలా సీతారామన్‌లతో కలసి దీనిని ఆవిష్కరించారు. రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని 27 మంది సభ్యుల కమిటీ, " మోదీ గ్యారెంటీ-2047 నాటికి వికసిత భారత్ " థీమ్‌తో ఈ సంకల్ప పత్రాన్ని రూపొందించింది.

భవిష్యత్తులో పైపులైన్ ద్వారా ఇంటింటికి గ్యాస్ కనెక్షన్లు, వచ్చే ఐదేళ్లపాటు ఉచిత రేషన్, 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు 5లక్షల రూపాయల వరకు ఉచిత వైద్యం, పేదలకు 3 కోట్ల ఇళ్ల నిర్మాణం, 20 లక్షల రూపాయల వరకు ముద్ర పథకం రుణాలు, వ్యవసాయ రంగంలో డ్రోన్‌ల వినియోగం పెంచడం వంటి అంశాలను ఈ మెనిఫెస్టోలో పొందుపరిచారు.

---------------------------

నూతనంగా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం నేటితో ముగియనుంది. 18 సంవత్సరాల వయసు నిండి.. ఓటర్ జాబితాలో పేరులేని వారంతా ఈనెల 15వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా గానీ లేదా సంబంధిత రెవెన్యూ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో గానీ ఫారం-6ను సమర్పించడం ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సూచించారు. ఈ నెల 15వ తేదీలోగా ఓటరుగా నమోదు చేసుకున్నవారందరికీ తప్పకుండా ఓటు హక్కు కల్పిస్తామని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్‌గా నమోదు కావడమే కాకుండా మే 13వ తేదీన జరిగే పోలింగ్‌లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకోవాలని మీనా ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

---------------------------

తూర్పుగోదావరి జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు ఈవీఎంలు, వాటి అనుబంధ యూనిట్లను సెంట్రలైజ్డ్ గోడౌన్ నుంచి నియోజకవర్గాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. నిన్న నిర్వహించిన ఆ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ మాధవీలత పర్యవేక్షించారు. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల కోసం కేటాయించిన బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వివిప్యాట్ యూనిట్లను వేర్వేరుగా పంపించి భద్రపరిచినట్లు వెల్లడించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, నోడల్ అధికారిణి ఆర్డీవో చైత్ర వర్షిణి ఆధ్వర్యంలో ఈవీఎంల తరలింపు పూర్తి చేసారు.

---------------------------

త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలను సజావుగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. శనివారం స్థానిక సర్. సిఆర్ ఆర్ కళాశాలలో సూక్ష్మ పరిశీలకుల శిక్షణా కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఒక వేయి

743 పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.జిల్లాలో సుమారు 16.33 లక్షల మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. జిల్లాలోని 415 సున్నితమైన పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లను నియమించి వారికి శిక్షణ అందిస్తున్నామన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం 46 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 8 అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు, 36 స్టాటిక్ సర్వెయిలెన్స్ టీంలను నియమించామన్నారు. జిల్లాలో ఇంతవరకు కోటి 75 లక్షల రూపాయల నగదు, కోటి 25 లక్షల విలువైన మద్యం, 10 కోట్లకు పైగా విలువైన బంగారాన్ని సీజ్ చేసామన్నారు.

---------------------------

ఇంటర్మీడియట్ ప్రవేశాల ప్రక్రియను మే 15 నుంచి ప్రారంభించేందుకు షెడ్యూల్ విడుదల చేసామని ఇంటర్మీడియట్ విద్యామండలి అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు రెండు విడతలుగా నిర్వహిస్తామని అధికారులు వెల్లడించారు. మొదటి విడతలో మే 15 నుంచి దరఖాస్తులు విక్రయించి, జూన్ 1 లోపు స్వీకరిస్తామని చెప్పారు. మే 22 నుంచి మొదటి విడత ప్రవేశాలు చేపడతామని, జూన్ 1 లోపు పూర్తి చేస్తామన్నారు. రెండో విడత ప్రవేశాలను జూన్ 10 నుంచి జులై 1 లోపు పూర్తి చేస్తామని అధికారులు వివరించారు.

---------------------------

ఆరాబోయే ఎన్నికల్లో దేవదాయ సిబ్బంది సేవలను వినియోగించకోవద్దని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని కోరింది. కొంతమంది ఉన్నతాధికారులు ఎన్నికల నిర్వహణలో దేవదాయ సిబ్బందిని వినియోగించుకోవాలని సూచించినట్లు తెలిసిందనీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరి అన్నారు. గతంలో ఏ ఎన్నికల్లోనూ దేవదాయ శాఖ సిబ్బంది సేవలను వినియోగించుకోలేదని గుర్తు చేసారు. వచ్చే మూడు నెలల్లో చాలా పండుగలు ఉన్నందున, దేవదాయ సిబ్బందికి చేతినిండా పని ఒత్తిడి ఉంటుందని వివరించారు. రాష్ట్రంలోని విద్యాసంస్థలు అన్నింటికీ వేసవి సెలవులు ఉన్నందున ఎన్నికల విధులు నిర్వహించడానికి ప్రతీ జిల్లాలోనూ వేలాది మంది ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారనీ, వారి సేవలు వినియోగించుకోవాలనీ సూచించారు.

---------------------------

ఐపిఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఇవాళ మధ్యాహ్నం మూడున్నర గంటలకు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్, లక్నో సూపర్ జైంట్స్ మధ్య మ్యాచ్ జరగనుంది. కోల్‌కతా జట్టు ఇప్పటివరకూ 4 మ్యాచ్‌లు ఆడి మూడింట్లో గెలిచి ఆరు పాయింట్లు సాధించింది. లక్నో జట్టు ఇప్పటివరకూ 5 మ్యాచ్‌లు ఆడి మూడింట గెలిచి ఆరు పాయింట్లు సాధించింది. ఈడెన్ గార్డెన్స్... రెండు జట్లకూ బాగా అలవాటైన గ్రౌండ్ కావడంతో ఆట ఉత్కంఠ భరితంగా ఉండనుంది.

మరో మ్యాచ్ ఈ రాత్రి ఏడున్నర గంటలకు ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరగనుంది. ముంబై ఇండియన్స్ జట్టు చెన్నై సూపర్ కింగ్స్ జట్టుతో తలపడనుంది. సిఎస్‌కె టీమ్ ఐదు మ్యాచ్‌లు ఆడి మూడు గెలిచి ఆరు పాయింట్లు సాధించింది. ముంబై జట్టు కూడా ఐదు మ్యాచ్‌లు ఆడినా రెండే గెలిచి నాలుగు పాయింట్లతో వెనుకబడి ఉంది. చెన్నై టీంకి ధోని, ముంబై జట్టుకు రోహిత్ శర్మ కెప్టెన్లుగా లేకుండా తలపడుతున్న మొదటి మ్యాచ్ కావడంతో ఈ మ్యాచ్‌పై ఆసక్తి నెలకొంది.

---------------------------

రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్ర అధికారి డి. శేషసాయి కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ...

**......వాయిస్.... 35 సెకన్లు....**

---------------------------

పరపతి విధాన నిర్ణయాలకు వాతావరణంలో తరచూ చోటుచేసుకుంటున్న మార్పులే సవాళ్లుగా మారాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా–ఆర్‌బీఐ తన నివేదికలో తెలిపింది. వాతావరణ మార్పులు, వ్యవసాయ ఉత్పత్తి, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలపై ప్రభావం చూపుతాయని, తద్వారా ద్రవ్యోల్బణంపై నేరుగా ప్రభావం పడుతుందని, వడ్డీ రేట్ల స్వరూపాన్ని కూడా వాతావరణ మార్పులు ప్రభావితం చేస్తాయని నివేదిక వివరించింది.

---------------------------

ఎన్నికల సందర్భంగా విజయనగరంలో జరిపిన తనిఖీలలో, భారీగా బంగారాన్ని ఒకటో పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు లేకపోవడంతో కోటి 50 లక్షల రూపాయల విలువైన 2.68 కేజీల బంగారు ఆభరణాలు, 17 లక్షల 50 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు.

========================